సాక్షి అనంతపురం

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.



శభాష్ కిట్టయ్య

నార్పల మండలం మద్దలపల్లికి చెందిన కిట్టయ్య 15 ఏళ్లుగా అటవీ ప్రాంతంలో మూగజీవాల దప్పిక తీర్చేందుకు శ్రమిస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
40.1°/21.8°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నీటి సరఫరాలో సమస్యలపై నేడు కలెక్టర్ 'ఫోన్‌ఇన్'



అనంతపురం అర్బన్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాలో సమస్యలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకునేందుకు కలెక్టర్ వి.వినోద్ కుమార్ గురువారం ఆకాశవాణి కేంద్రం నుంచి 'అనంత మిత్ర ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 7.45 నుంచి 8.15 గంటల వరకు కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరిస్తారు. ప్రజలు 08554-225533, 296890 నంబర్లకు ఫోన్ చేసి తాగునీటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లవచ్చు.

100 శాతం సబ్సిడీతో డ్రిప్

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఎస్సీ, ఎస్టీలు, చిన్న, సన్నకారు రైతులకు 100 శాతం సబ్సిడీతో బిందు సేద్యానికి ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ ప్రాథమిక రంగ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఐదెకరాల విస్తీర్ణానికి సబ్సిడీ మొత్తం రూ.2.18 లక్షలుగా ఉంటుందని, ఐదు నుంచి 10 ఎకరాలు ఉన్న రైతు (ఎస్సీ, ఎస్టీలతో సహా) 90 శాతం సబ్సిడీ, పెద్ద రైతులకు (12.5 ఎకరాలు) 50 శాతం సబ్సిడీతో డ్రిప్ అందిస్తామన్నారు.

తపాలా ఎస్పీపై ఉన్నతాధికారుల సీరియస్

- తక్షణం రిలీవ్ కావాలని ఆదేశం
- కడప ఎస్పీ రాజేష్‌కు ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా శాఖ సూపరింటెండెంట్ (ఎస్పీ) బి.గుంపస్వామిపై ఆ శాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. తెలంగాణ సర్కిల్‌లోని ఆదిలాబాద్ డివిజన్‌కు ఆయన్ను బదిలీ చేస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆయన రిలీవ్ కాకుండా అనంతపురంలోనే కొనసాగాలని నిర్ణయించుకుని, బదిలీ రద్దు కోరుతూ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ విన్నపాన్ని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో బదిలీ రద్దు కోసం ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు పెంచారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు ఈ నెల 9వ తేదీలోపు విధుల నుంచి తప్పనిసరిగా రిలీవ్ కావాలని ఉత్తర్వులు జారీ చేశారు. లేకపోతే ఈ నెల 16 నుంచి జీతం నిలిపివేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కడప తపాలా ఎస్పీగా పనిచేస్తున్న రాజేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 16న అనంతపురం డివిజన్ ఎస్పీగా అదనపు బాధ్యతలను రాజేష్ స్వీకరించనున్నట్లు సమాచారం.

హనుమద్ వాహనంపై శ్రీవారు



తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం హనుమద్ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథుడు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. రాత్రి హనుమద్ వాహన సేవలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

విద్యార్థుల జీవితాలతో కూటమి సర్కారు చెలగాటమాడుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తూ వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. కళ్ల ముందే బిడ్డలు పడుతున్న అవస్థలు చూడలేక తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు, పుస్తెలు తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్న దుస్థితి నెలకొంది.

- రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించని కూటమి సర్కారు
- 'వైఎస్సార్ సీపీ పోరుబాట'తో పాక్షికంగా చెల్లింపులు
- మొత్తం చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామంటున్న కళాశాలల యాజమాన్యాలు
- స్వయంగా నారా లోకేష్ ఆదేశాలు జారీ చేసినా బేఖాతరు
- త్వరలో బీటెక్ పరీక్షలు.. తీవ్ర ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



ఫీజులు.. బెంబేలు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో త్వరలో బీటెక్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా కళాశాలల్లోనే నేరుగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించడానికి వెళ్తే సిబ్బంది ససేమిరా అంటున్నారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల, పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలల్లో కోర్సు ఫీజు ముందస్తుగా చెల్లిస్తేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారం అందించగా... అప్పులు చేసి డబ్బు సమకూరుస్తున్నట్లు సమాచారం.

మంత్రి ఆదేశాలు బేఖాతర్..

కోర్సు ఫీజులతో సంబంధం లేకుండా పరీక్షలకు అనుమతించాలని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉత్తర్వులు జారీ చేయగా.. ఆ మేరకు జిల్లా కలెక్టర్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయినా మాజీ మంత్రి, టీడీపీ నేత పల్లె రఘునాథ రెడ్డికి చెందిన పీవీకేకే కళాశాలతో పాటు అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు పట్టించుకోకపోవడం గమనార్హం. ఫీజు వసూలే తమ లక్ష్యమనేలా వ్యవహరిస్తూ విద్యార్థులను బెంబేలెత్తిస్తున్నాయి.

ఒక్కసారిగా తలకిందులు..

వాస్తవానికి గడిచిన విద్యా సంవత్సరంలో చివరి రెండు త్రైమాసికాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 'వసతి దీవెన' నిధులు గతేడాది జూన్‌లో చెల్లించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆ నిధులు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమయ్యేవి. కానీ, కూటమి ప్రభుత్వం రావడంతో పరిస్థితి మారిపోయింది. పాత విద్యా సంవత్సరంలో రెండు త్రైమాసికాల బకాయిలు, ఈ విద్యా సంవత్సరంలో పూర్తయిన మూడు త్రైమాసికాలకు కలిపి రూ. 90 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు. పథకాల పేర్లు మార్చారే కానీ.. నిధుల ఊసే ఎత్తడం లేదు. మరో వైపు ఇళ్లకు దూరంగా హాస్టళ్లలో ఉంటూ చదువుకునే విద్యార్థులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'వసతి దీవెన' అందించి ఆదుకోగా.. నేడు ఆ పథకాన్నే పూర్తిగా నిలిపేయడం శాపంగా మారింది.

వైఎస్సార్ సీపీ పోరుబాటతో..

రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ ఇటీవల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువత పోరుబాట'తో కూటమి సర్కారు ఉలిక్కి పడింది. అప్పటికప్పుడు తేరుకుని ఒక త్రైమాసికానికి సంబంధించి రూ.30 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, అందులోనూ పాక్షిక చెల్లింపులే జరిగాయి. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేయడం ప్రారంభించాయి. ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నట్లు తెలిసింది.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఫీజుల కోసం వేధింపులకు పాల్పడుతున్న ఇంజినీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జేఎన్‌టీయూ (ఏ) పాలక భవనం వద్ద బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నయాపైసా బకాయి పెట్టకుండా మొత్తం చెల్లిస్తామని మంత్రి లోకేష్ చెప్పారని, ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తే కళాశాల గుర్తింపు కూడా రద్దు చేస్తామని ఆయన ప్రకటించినా ఖాతరు చేయకపోవడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదన్నారు. వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు మాట్లాడుతూ.. రెండు వారాల క్రితమే అన్ని కళాశాలలకు సర్క్యులర్ జారీ చేశామని, తాజాగా మరో సర్క్యులర్ జారీ చేస్తామని పేర్కొన్నారు. ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, నగర ఉపాధ్యక్షుడు సోము, విజయ్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం జేఎన్‌టీయూ పాలక భవనం వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

2019-20 నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు ఇలా

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	ఫీజులు (రూ.కోట్లలో)
2019-20	45,491	103.73
2020-21	50,571	83.78
2021-22	50,702	100.53
2022-23	42,915	105.43
2023-24	40,006	28.08
2024-25	42,000	0

వసతి దీవెన నిధులు ఇలా..

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	45,491	42.37
2020-21	50,571	47.96
2021-22	50,702	45.25
2022-23	42,915	37.46
2023-24	40,006	00.00

బెళుగుప్పలో అర్జీల కుప్ప

- 'ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు వినతుల వెల్లువ
- అన్నింటినీ పరిష్కరిస్తాం: మంత్రి కేశవ్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఆర్థికశాఖ మంత్రి కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

బెళుగుప్ప: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అర్జీలు వెల్లువెత్తాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో ఏకంగా 713 వినతులు అందడం గమనార్హం. రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరు, భూ సమస్యలతో పాటు రహదారుల నిర్మాణాలు, గ్రామాభివృద్ధికి సంబంధించిన వినతులే ఎక్కువగా ఉన్నాయి.అర్జీల స్వీకరణ అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామన్నారు. హంద్రీ–నీవా కాలువ వెడల్పునకు రూ.3,800 కోట్ల నిధులను కేటాయించి 70 రోజుల్లో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఒకే సారి హంద్రీ–నీవా కాలువలోకి 12 మోటార్లు పంపింగ్ చేయవచ్చన్నారు.అంతకుముందు రూ.1.75 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని, రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ కేంద్రాన్ని, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.16.7 లక్షలతో నిర్మించిన రహదారిని మంత్రి ప్రారంభించారు. బెళుగుప్ప కేజీబీవీలో 8వ తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ వసంతబాబు, డీఎంహెచ్ఓ ఈబీదేవి, తహసీల్దార్ షర్మిళ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక, ఎంఈఓ మల్లారెడ్డి, కేజీబీవీ ఎస్ఓ నాగరత్న, ఎంపీపీ పెద్దన్న, సర్పంచ్ సాలీబాయి, వైస్ ఎంపీపీ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

13న యూపీఎస్సీ ఫ్లాగ్‌షిప్ పరీక్ష

అనంతపురం అర్బన్: 'యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీకి సంబంధించి ఈనెల 13న ఫ్లాగ్‌షిప్ పరీక్ష జరగనుంది. రెండు కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 363 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. యూపీఎస్సీ నిబంధనలను అనుసరించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరుగుతాయన్నారు. అధికారులు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.రామ్మోహన్, రూట్ ఆఫీసర్‌గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, కేఎస్ఎన్ డిగ్రీ, పీజీ కళాశాల పరీక్ష కేంద్రానికి ఇన్‌స్పెక్టింగ్ అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, రూట్ అధికారిగా వి.మల్లికార్జునరెడ్డిని నియమించామన్నారు. కేంద్రం వద్ద ఒక ఎస్ఐ, ఇద్దరు పురుష, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించే సమయంలో నలుగురు ఆర్మ్‌డ్ పోలీసులను ఎస్కార్ట్‌గా నియమించాలని చెప్పారు. కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్ష వేళలకు అనుకూలంగా బస్సులు నడపాలని ఆదేశించారు. 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పరీక్ష సమయం ఇలా...

- ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్ష జరుగుతుంది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు పేపర్–2, 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పేపర్–3 పరీక్ష జరుగుతుంది.
- కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల పరీక్ష కేంద్రంలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావెల్ అకాడమీ పరీక్షకు సంబంధించి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్–2 జరుగుతుంది.
- అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి.
- ఈ–అడ్మిట్ కార్డుతో పాటు ఏదేని గుర్తింపు కార్డు, సెల్ఫ్ ఫొటోలు, పెన్, పెన్సిల్ తీసుకురావాల్సి ఉంటుంది.
- మొబైల్ ఫోన్లు, డిజిటల్, స్మార్ట్ గడియారాలు, బ్లూటూత్ తదితర వస్తువులను అనుమతించరు.

నిషేధిత భూములపై శిక్షణ

అనంతపురం అర్బన్: నిషేధిత భూములు (22ఏ), చుక్కల భూముల సమస్యల పరిష్కారంపై తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టాదారు పాసుపుస్తకాన్ని ఆధార్‌తో అనుసంధించాలని చెప్పారు.రెవెన్యూ సెక్టార్‌పై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోలతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ 'అనంత అభ్యాసం' కింద ఈనెల 11న డివిజన్, మండలస్థాయి రెవెన్యూ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తాను, జేసీ పాల్గొంటామని చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకాన్ని ఆధార్‌తో అనుసంధానించే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీల పరిశీలన చేపట్టాలని, నివేదికలు ఈ–ఆఫీసులో సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' మూల్యాంకనం

- ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) బుధవారం ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంతంగా ముగియడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షలు, స్పాట్ విధుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ డీఈఓ ఎం.ప్రసాద్ బాబు ధన్యవాదాలు తెలిపారు. స్పాట్ ముగిసిన సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ ప్రసాద్ బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కరణం హరి కృష్ణ, బాల సుబ్రహ్మణ్యం, మహబూబ్ ఖాన్, ఖలందర్, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, ఆదిశేషయ్య, తిమ్మప్ప, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేగావత్ రవీంద్రనాథ్,హెచ్ఎం పురుషోత్తం బాబు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ, పరీక్షల ఏసీని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

హిందీ టీచరుకు సన్మానం

ఏటా మాదిరిగానే ఈ సారి కూడా రిటైర్డ్ అయిన హిందీ టీచర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ టీచరు అల్లు సుబ్బ కృష్ణమనాయుడుని డీవైఈఓ శ్రీనివాసరావు, ఏసీ గోవింద నాయక్ చేతులమీదుగా ఏసీఓ, హెచ్ఎంలు పి.ఫయాజుద్దీన్,అజ్మ తుల్లా, చంద్రమౌళి ఆధ్వర్యంలో సన్మానించారు. సంప్రదాయాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీకి విఫలయత్నం

- దుండగుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

కళ్యాణదుర్గం రూరల్: మహిళ మెడలో ఓ వ్యక్తి గొలుసు చోరీకి విఫలయత్నం చేశాడు. బాధితురాలు కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోతున్న దుండగుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు.. పట్టణానికి చెందిన జయలక్ష్మి కళ్యాణదుర్గం ఆర్‌డీటీ ఆసుపత్రిలో పనిచేస్తోంది. బుధవారం సాయంత్రం విధులు ముగించుకున్న ఆమె ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఆమె వద్దకు వచ్చిన దుండగుడు.. మెడలోని బంగారు చైను దొంగిలించడానికి ప్రయత్నించాడు. బాధితురాలు కేకలు వేయటంతో అక్కడి నుంచి పరుగు తీశాడు. వెంబడించిన స్థానికులు దుండగుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీలో 10 మందికి పదోన్నతి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న పది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరికి ఉత్తర్వులను బుధవారం తన చాంబర్‌లో జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డితో కలసి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అందజేశారు. అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలో పనిచేస్తున్న డి.మాధవి చౌదరికి పదోన్నతి కల్పిస్తూ తిరిగి జెడ్పీనే కేటాయించారు. ఇదే కార్యాలయంలో పని చేసే బి.సుశీలాదేవిని పెనుకొండలోని పీఆర్ క్యూసీ సబ్ డివిజన్‌కు, కె.రమాదేవిని చిలమత్తూరు మండల పరిషత్ కార్యాలయానికి, విజయవాడలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఎం.అరుణశ్రీని యల్లనూరు మండల పరిషత్ కార్యాలయానికి కేటాయించారు. తగరకుంట హైస్కూల్‌లో పని చేస్తున్న పి.షాహీనా బేగంను రొద్దం మండల పరిషత్ కార్యాలయానికి, పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే జి.రవీంద్రను పుట్టపర్తి పీఆర్ అనుబంధ పీఐయూ సబ్ డివిజన్‌కు, సిద్ధరాంపురం జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసే జె.సుబ్రహ్మణ్యంను లేపాక్షి మండల పరిషత్ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు. ఎద్దులపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసే పి.ఉమామహేశ్వరరెడ్డిని గుత్తిలోని ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్‌కు, నాగసముద్రం జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసే వి.విశ్వనాథ్‌ను మడకశిర పీఆర్ఐ సబ్ డివిజన్‌కు, రాయదుర్గం మండల పరిషత్ కార్యాలయంలో పని చేసే పి.మహేష్‌ను కణేకల్లు మండల పరిషత్ కార్యాలయానికి పదోన్నతిపై బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందజేశారు.



ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి

గాలివాన బీభత్సం



కె.కొత్తపల్లిలో దెబ్బతిన్న పంట





పొలంలో ఆవేదన చెందుతున్న రైతు హనుమంతరెడ్డి, పుల్లంపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

- కణేకల్లు మండలంలో వందలాది ఎకరాల్లో నేలకొరిగిన మొక్కజొన్న పంట
- వారం, పది రోజుల్లో కోత కోయాల్సి ఉందంటూ రైతుల ఆవేదన

కణేకల్లు: మండలంలో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. కణేకల్లు, కె.కొత్తపల్లి, పుల్లంపల్లి, పూలచెర్ల, కణేకల్లు క్రాస్, యర్రగుంట తదితర గ్రామాల్లో సుమారు 250 ఎకరాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. పుల్లంపల్లిలో వీరేష్, భాస్కర్, కె.కొత్తపల్లిలో హనుమంతరెడ్డి, కురుబ మల్లయ్య, మాదిగ దుర్గన్న, క్రిష్ణారెడ్డి, ఎ.గోవిందరెడ్డి తదితర రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నాయి. పంట కాపు బాగా కాసింది. వారం, పది రోజుల్లో కోత కోయాల్సి ఉంది. ఈ క్రమంలో పెట్టుబడుల కోసం చేసిన అప్పులను తీర్చేసుకోవచ్చని ఆశలు పెట్టుకొన్న రైతులకు గాలివాన తీవ్ర నిరాశే మిగిల్చింది. ఎకరా మొక్కజొన్న సాగుకు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఒక్కసారిగా గాలివానకు మొత్తం తుడిచి పెట్టుకుపోయిందంటూ బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పులెలా తీర్చాలో దిక్కుతోచడం లేదని కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


మృతురాలు భాగమతి

పుట్లూరు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన భాగమతి (32)కి మూడేళ్ల క్రితం పుట్లూరు మండలం గాండ్లపాడుకు చెందిన రామేశ్వరరెడ్డితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. రెండేళ్ల క్రితం రామేశ్వరరెడ్డి రెండు ఎకరాల భూమిని విక్రయించగా వచ్చిన రూ.30 లక్షలను ఇతరులకు అప్పుగా ఇచ్చాడు. అప్పు తీసుకున్న వ్యక్తి వడ్డీలు సక్రమంగా చెల్లించక పోగా, అసలు చెల్లింపులోనూ తాత్సారం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపానికి గురైన భాగమతి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరి భారతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పరిటాల సునీత ఏజెంట్ ఎస్‌ఐ సుధాకర్

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు

అనంతపురం కార్పొరేషన్: ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ పోలీస్ అధికారిగా కాకుండా ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఏజెంట్‌లా విధులు నిర్వర్తిస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రామగిరి ఎస్ఐగా ఉన్నప్పటి నుంచి సుధాకర్‌యాదవ్ కేవలం వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. 20 ఏళ్ల నాటి ఫ్యాక్షన్ సంస్కృతిని తీసుకువచ్చేందుకు టీడీపీ సాగిస్తున్న కుట్రకు సుధాకర్‌యాదవ్ ఊతమిస్తూ ఆ పార్టీ కార్యకర్తలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నాడని ఆరోపించారు. పోలీసు శాఖను అప్రతిష్టపాలు చేస్తున్న సుధాకర్ యాదవ్‌పై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నెమలి వాహనంపై ఆదిదంపతులు



కూడేరు: ప్రసిద్ధిగాంచిన పార్వతీపరమేశ్వర స్వయంభు జోడులింగాల సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం రాత్రి నెమలి వాహనంపై భక్తులకు ఆదిదంపతులు దర్శనమిచ్చారు. ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉద్యానం.. పనితీరు అధ్వానం

- జిల్లా స్థాయి అధికారి లేక గాడితప్పిన పాలన
- జిల్లాలో 3 లక్షల ఎకరాలకు పైగా ఉద్యానతోటలు
- 72 రకాల ఉద్యాన పంటల సాగు
- పంట సస్యరక్షణ సలహాలు అందక రైతుల అవస్థలు



అనంతపురం అగ్రికల్చర్: 'పేరు గొప్ప... ఊరు దిబ్బ' అనే చందంగా మారింది జిల్లా ఉద్యానశాఖ పరిస్థితి. పదేళ్ల కిందటే ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగా పేరు పొంది... ప్రస్తుతం ఉద్యానహబ్‌గా పిలవబడుతున్న 'అనంత'లో ఆ శాఖకు జిల్లా స్థాయి అధికారి లేక ఏడాదవుతోంది. డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) స్థాయి అధికారి డిప్యుటేషన్‌లో ఉన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) స్థాయి అధికారి నెల రోజుల పాటు సెలవులో వెళ్లారు. కనీసం ఇన్‌చార్జి అధికారిని కూడా నియమించలేదు. దీంతో పాలన గాడితప్పి హెచ్‌ఓ స్థాయి అధికారులే అతి కష్టమ్మీద నెట్టుకొస్తున్నారు. పథకాల అమలు, పంటల సస్యరక్షణ సలహాలు అందక ఉద్యాన రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వంలో కాసింత కూడా చలనం లేకుండా పోయింది.

విస్తీర్ణంలో నంబర్ వన్

జిల్లాల విభజన జరిగిన తర్వాత కూడా ఉద్యాన తోటల విస్తీర్ణంలో 'అనంత' మొదటి స్థానంలో ఉంది. యాపిల్ లాంటి నాలుగైదు రకాలు మినహా మిగిలిన అన్ని రకాల ఉద్యాన తోటలకు నిలయంగా మారింది. జిల్లా నుంచి చీనీ, అరటి, దానిమ్మ, టమాట, గులాబీ తదితర ఉత్పత్తులు ఉత్తరాది రాష్ట్రాలతో పాటు విదేశాలకూ ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీలో పేరున్న అజాద్‌పూర్ మండీలో 'అనంత' ఉద్యాన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. వేలాది మంది ఉద్యాన రైతుల శ్రమ ఫలితంగా లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు, రూ.వేల కోట్ల టర్నోవర్‌తో అనంతపురం జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇటీవల హార్టికల్చర్ కాంక్లేవ్ పేరుతో జాతీయ స్థాయి సదస్సు సైతం అనంతపురంలోనే నిర్వహించారు. అరటి, చీనీ, మిరప, మామిడి, టమాట పంటలను ఐదు గ్రోత్ ఇంజన్లుగా గుర్తించి కొన్ని కార్పొరేట్ కంపెనీలతో ఎంఓయూలు కూడా చేసుకున్నారు. ఇవన్నీ సక్రమంగా అమలు చేసి వాటి ఫలాలు రైతులకు అందించే సరైన అధికారులు లేరు. అతి తక్కువ ఉద్యానతోటల విస్తీర్ణం కలిగిన కొన్ని జిల్లాల్లో డీడీ స్థాయి అధికారులను నియమించిన ప్రభుత్వం... ఉద్యానహబ్‌గా పేరున్న 'అనంత'ను నిర్లక్ష్యం చేయడం గమనార్హం.

72 రకాల ఉద్యాన తోటలు

జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లోనూ పండ్ల తోటలు పెద్ద ఎత్తున విస్తరించాయి. వేలాది మంది రైతులు వ్యవసాయ పంటలను తగ్గించి అంతో ఇంతో నీటి వనరుల కింద పండ్లు, పూలు, కూరగాయలు ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. తాజా నివేదిక ప్రకారం 3 లక్షల ఎకరాల్లో ఉద్యాన తోటలు ఉండగా... అందులో 1.80 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, 55 వేల ఎకరాల్లో కూరగాయ పంటలు, 40 వేల ఎకరాల్లో సుగంధం, ఔషధ పంటలు, పూలతోటలు సాగులో ఉన్నాయి. ఒకట్రెండు కాదు... ఏకంగా 72 రకాల ఉద్యాన తోటలు సాగులో ఉన్నట్లు ఈ–క్రాప్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వీటి ద్వారా ఏటా 38 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఫలసాయం వస్తోంది. రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు టర్నోవర్ ఉన్నట్లు గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి.

అందని సలహాలు సూచనలు

తరచూ వర్షాభావ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పు కారణంగా చీడపీడలు, తెగుళ్ల బెడద కూడా అధికంగా ఉంటోంది. అకాల వర్షాలు, ఈదురుగాలులు కూడా ఏటా దెబ్బతీస్తున్నాయి. అలాగే మార్కెటింగ్ సమస్య సైతం రైతులను వేధిస్తోంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఉద్యాన తోటలు సాగు చేస్తున్న 'అనంత'లో ఖచ్చితంగా జిల్లా స్థాయి (డీడీ) అధికారి ఉండాల్సిన చోట... ఏడీ స్థాయి అధికారితో నెట్టుకొస్తున్నారు. ఆయన కూడా ఇటీవల సెలవు పెట్టారు. ఇన్‌చార్జి అధికారినీ నియమించలేదు. గతంలో ఇక్కడకు రెగ్యులర్ డీడీని నియమించినా... బాధ్యత తీసుకున్న రోజే డిప్యుటేషన్ కింద కమిషనరేట్‌లో పనిచేస్తున్నారు. దీంతో ఏడీ బీఎంవీ నరిసింహారావుకే ఇన్‌చార్జి డీడీ బాధ్యతలు అప్పజెప్పారు. ఆయనకు టెలీ కాన్ఫరెన్స్‌లు, జూమ్ మీటింగ్, కమిషనరేట్ రివ్యూలు, కలెక్టరేట్ సమీక్షలకు హాజరయ్యేందుకే సమయం చాలడం లేదంటున్నారు. ఇపుడు ఆయన కూడా సెలవు పెట్టడంతో ఉద్యానశాఖకు దిక్కులేకుండా పోయింది. సస్యరక్షణ సిఫారసులు, సాంకేతిక సలహాలు, పథకాల సమాచారం ఇచ్చేవారు లేకపోవడంతో రైతులకు పెద్ద సమస్యగా మారింది.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: డీఎస్సీ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా అందజేస్తున్న ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకులు సుమన జయంతి కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాల కోసం 08554-275575లో సంప్రదించవచ్చు.

మహిళపై దేవర దున్నపోతు దాడి


గాయపడిన అనంతమ్మ

గుత్తి: మండల పరిధిలోని శ్రీపురం (కొజ్జేపల్లి) గ్రామానికి చెందిన అనంతమ్మపై మంగళవారం రాత్రి దేవర దున్నపోతు దాడి చేసింది. ఇంటి బయట నిద్రిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. దాడిలో తీవ్రంగా గాయపడిన అనంతమ్మను కుటుంబ సభ్యులు తొలుత గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వివాహితపై అత్యాచార యత్నం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం ఎర్రపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన యువకుడు చంద్ర అత్యాచారయత్నం చేశాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో వరి కల్లాల వద్ద ఉన్న ఒంటరిగా వివాహితను గమనించిన చంద్ర అత్యాచారం చేయబోతే ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది. ఆ సమయంలో ఆమె గొంతు, మెడపై దాడి చేసి యువకుడు పరారయ్యాడు. బుధవారం ఉదయం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే సమస్యలను పరిష్కరించాలి

- డీఆర్‌యూసీసీ సమావేశంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల విజ్ఞప్తి


డీఆర్‌యూసీసీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: రైల్వేలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేయూతనివ్వాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో 66వ డివిజినల్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్త అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతోపాటు డివిజన్ పరిధిలోని డీఆర్‌యూసీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలో రైల్వే పరమైన అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ముద్దనూరు–ముదిగుబ్బ మధ్య 65 కిలోమీటర్ల మేర నూతన రైల్వే లైన్ మార్గం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. తద్వారా కడపలోని పారిశ్రామిక ఉత్పత్తులు, ఎగుమతులకు, రైతులు పండించిన పంటలు ఇతర ప్రాంతాలకు తరలించడానికి రవాణామార్గం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ నిరంతరాయంగా రిజర్వేషన్ కౌంటర్లు ఉండేలా చూడాలన్నారు. కరోనా సమయంలో రద్దయిన విజయవాడ–బెంగుళూరు, తిరుపతి–హుబ్లీ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. అలాగే కరోనా కారణంగా స్టాపింగ్‌లు నిలిపి వేసిన స్టేషన్లను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి అవరోధంగా మారిన ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేట్ స్థానంలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు చేపట్టాలని, కసాపురం రైల్వే మోరీ విస్తీరణ పనులు చేపట్టాలని సూచించారు. సమస్యలను రైల్వేబోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్త అన్నారు. సమావేశంలో సీనియర్ డీసీఎం మనోజ్, డీఆర్‌యూసీసీ సభ్యులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

చిలమత్తూరు: బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. చిలమత్తూరు మండలం పాతచామలపల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ (52) హిందూపురంలో నివాసముంటూ ముదిరెడ్డిపల్లిలో చేనేత పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల తన స్వగ్రామానికి వచ్చిన ఆమె బుధవారం చిలమత్తూరు నుంచి హిందూపురం వైపు వెళుతున్న ప్రైవేటు బస్సులో తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో బైరేకుంట సమీపంలోకి చేరుకోగానే మలుపు వద్ద డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపడంతో అదుపు తప్పి ఆదిలక్ష్మమ్మ బస్సు డోరులో నుంచి రోడ్డుపైకి వచ్చి పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని అక్కడే ఆపి ఉడాయించాడు. ఘటనపై ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తండ్రి కోసం తనయ పోరాటం

కుటుంబాన్ని పోషించేందుకు ఆ తండ్రి రెక్కలు ముక్కలు చేసుకుని బండరాళ్లు కొట్టాడు. మండుటెండలో పునాది రాళ్లను కొడుతూ అహర్నిశలు శ్రమించాడు. నాలుగు రాళ్లు సంపాదించి కుమార్తెలకు పెళ్లిళ్లు చేయాలనే తపనతో ఆకలి దప్పికలు మరిచాడు. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచింది. విధి వక్రీకరించి మంచానపడ్డాడు. ఏనాడూ గడప దాటి ఎరుగని కుమార్తె.. నేడు తండ్రి వైద్యం ఖర్చులు, కుటుంబ పోషణ కోసం పలువురి ఇళ్లలో పనులకు వెళుతోంది. మెరుగైన వైద్యం అందిస్తే తన తండ్రి మామూలు మనిషిగా మారుతాడని, అయితే వైద్యానికి అయ్యే ఖర్చు తమ తలకు మించిన భారం కావడంతో ఆపన్నహస్తమందించాలని నిరుపేద కుటుంబం వేడుకుంటోంది.


శ్రీనివాసులును ఆదుకోవాలని కోరుతున్న భార్య లక్ష్మి, కుమార్తె జ్యోతి

- అనారోగ్యంతో మంచానపడ్డ తండ్రి
- సపర్యలు, ఇంటి పనుల్లో నిమగ్నమైన తల్లి
- కుటుంబ పోషణ, తండ్రి వైద్యం కోసం ఇళ్ల పనికి వెళ్తున్న కుమార్తె
- మెరుగైన వైద్యం కోసం ఆపన్న హస్తమందించాలని వేడుకోలు

ధర్మవరం అర్బన్: స్థానిక మహాత్మాగాంధీ కాలనీకి చెందిన మల్లిపోగుల శ్రీనివాసులు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పునాదులకు అవసరమైన రాళ్లను కొడుతూ కుటుంబాన్ని శ్రీనివాసులు పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అరకొర సంపాదనలోనే దాచుకుంటూ వచ్చిన డబ్బుతో పెద్ద కుమార్తె శిరీషకు పెళ్లి చేసి, అత్తారింటికి పంపారు. చిన్న కుమార్తె జ్యోతిని పదో తరగతి వరకు చదివించగలిగారు. అపై చదువులకు పంపే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంచేశారు.

సాధారణ జబ్బు కాదది

నెల రోజుల క్రితం మహాశివరాత్రి పండుగను సంతోషంగా జరుపుకునేందుకు శ్రీనివాసులు కుటుంబం సిద్ధమైంది. ఉదయం తలంటి స్నానం చేసిన తర్వాత ఇంట్లో పూజలు చేసుకుని ఆలయానికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా శ్రీనివాసులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. పరిస్థితి గమనించిన భార్య లక్ష్మి, కుమార్తె జ్యోతి వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం శ్రీనివాసులుకు రెండు కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమిస్తుండడంతో వెంటనే కర్నూలులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డయాలసిస్ చేయడంతో కాస్త ఉపశమనం దక్కింది. ఈ క్రమంలో ఎడమ కాలికి ఇన్‌ఫెక్షన్ సోకి సెప్టిక్ కావడంతో పెద్ద గాయమైంది. దీంతో శ్రీనివాసులు కనీసం కూర్చొనే పరిస్థితి కూడా లేకపోయింది.

ఇంటి వద్ద మంచానికే పరిమితం

ఎడమ కాలికి కట్టు కట్టిన తర్వాత కర్నూలు ఆస్పత్రి నుంచి వైద్యులు డిశ్చార్జ్ చేసి, ఇంటికి పంపారు. ఈ నేపథ్యంలో మరోసారి డయాలసిస్ అవసరం కావడంతో ఆస్పత్రికి తీసుకెళితే.. శ్రీనివాసులు పరిస్థితిని గమనించిన వైద్యులు డయాలసిస్ చేయడానికి సాధ్యం కాదని వెనక్కు పంపారు. అప్పటి నుంచి ఇంట్లోనే మంచానికే ఆయన పరిమితమయ్యాడు. ఈ మొత్తం ప్రక్రియలో ఇంట్లో చిన్న కుమార్తె పెళ్లికని దాచిన డబ్బు మొత్తం శ్రీనివాసులు చికిత్స కింద ఖర్చాయి.. మరికొంత తెలిసిన వారి వద్ద అప్పులు చేయాల్సి వచ్చింది. నిరుపేద కుటుంబం కావడంతో రోజూ పనికి వెళితే తప్ప పూట గడవని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఇంటి వద్ద భర్తకు సపర్యలు చేయడంలోనే భార్య లక్ష్మికి సమయం సరిపోతోంది. దీంతో ఏనాడు గడప దాటి ఎరుగని చిన్న కుమార్తె జ్యోతి.. తండ్రి ఆరోగ్యం మెరుగుపడాలనే తపనతో తొలిసారిగా ఇల్లు విడిచి బయట కూలి పనులకు సిద్ధమైంది. ఇంటింటికీ తిరిగి వారికి అవసరమైన పనులు చేసి పెట్టి, వారిచ్చిన కొద్దిపాటి డబ్బుతో తండ్రికి అవసరమైన మందులు, కాలికి డ్రస్సింగ్ చేసేందుకు అవసరమైన మందులు, డయపర్స్ కొనుగోలు చేస్తోంది. వీరి దుస్థితిని గమనించిన చుట్టుపక్కల వారు అప్పుడప్పుడు చిన్నపాటి సాయం అందిస్తున్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు.

తన తండ్రి మంచాన పడటంతో కుటుంబ పోషణ భుజాల మీదకు వేసుకున్న జ్యోతి ఇంటి పనులతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. అయితే తన సంపాదనతో తండ్రి ఆరోగ్యం ఎన్నటికీ బాగుపడదని గుర్తించిన ఆమె ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తోంది. తన తండ్రికి మెరుగైన వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని దాతలను వేడుకుంటోంది.


మంచానికే పరిమితమైన శ్రీనివాసులు

సాయం చేయదలిస్తే...

పేరు :మల్లిపోగుల లక్ష్మి
బ్యాంకు పేరు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ధర్మవరం బ్రాంచ్
ఖాతా నంబరు : 9103 349 4823
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : APGB0001029
సంప్రదించాల్సిన నంబర్ : 78424 68672

శభాష్ కిట్టయ్య!


తొట్టెలో నీరు పడుతున్న కిట్టయ్య


అటవీ ప్రాంతంలో నీటి కోసం వేచి ఉన్న వానరాలు

పెద్దపప్పూరు: చిరు వ్యాపారంతో జీవనం సాగిస్తున్న నార్పల మండలం నాయనపల్లికి చెందిన కిట్టయ్య 15 ఏళ్లుగా అటవీ ప్రాంతంలో మూగజీవాల ఆకలిదప్పికలు తీర్చేందుకు శ్రమిస్తున్నారు. రోజూ చిరుతిండ్లను సేకరించి ముచ్చుకోట అటవీ ప్రాంతంలో వానరాలకు అందజేస్తుంటారు. ఈ క్రమంలో 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు పగిలిపోవడంతో రెండు రోజుల క్రితం రూ.10 వేలు వెచ్చించి కొనుగోలు చేసిన 15 తొట్టెలను అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసి, రోజూ నీటితో నింపుతున్నాడు. కిట్టయ్య చేస్తున్న సేవను గమనించిన పలువురు వాహనదారులు వివిధ రకాల పండ్ల కొనుగోలుకు ఆర్థిక సాయం అందిస్తూ ముందుకు సాగుతుండడం గమనార్హం.


ఫుట్‌పాత్ పొడవునా తాటిముంజల విక్రయాలు చేపట్టిన దృశ్యం

వావ్.. చాలా బాగుంది!

ఐస్ ఆపిల్‌గా పిలిచే తాటిముంజలను నోట్లో పెట్టుకోగానే.. 'వావ్.. చాలా బాగుంది' అని మనకు తెలియకుండానే మాట జారిపోతుంటుంది. వేసవిలో మాత్రమే లభించే ఈ పండు ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య శాస్త్రవేత్తలు అంటుంటారు. ఇంతటి అమృత ఫలాన్ని గ్రామీణ ప్రాంతాలకు చెందిన కొందరు రైతులు అనంతపురంలోని వైద్య కళాశాల ఎదురుగా ఫుట్‌పాత్‌పై పెట్టుకుని విక్రయిస్తున్నారు. కొనుగోలుదారుల సమక్షంలోనే తాటికాయ గెలల నుంచి తాజా ముంజలను వేరు చేసి ఇవ్వడం వీరి ప్రత్యేకత.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


రాశిగా పోసిన తాటి కాయలు


తాటి ముంజలను కొనుగోలు చేస్తున్న నగరవాసులు

క్లుప్తంగా

ఘనంగా విన్సెంట్ ఫెర్రర్ జయంతి



కేక్ కట్ చేస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్

అనంతపురం: అనంతపురంలోని ఆర్డీటీ ప్రధాన క్యాంపస్‌లో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ మాట్లాడుతూ.. ఫాదర్ ఫెర్రర్ జీవితం, మానవతా విలువలు మనం చేసే పనిలో ప్రజల కోసం సేవాభావం అలవరచుకోవడానికి మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సహ వ్యవస్థాపకురాలు అన్నే ఫెర్రర్ తదితరులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విషా ఫెర్రర్ పాల్గొన్నారు. అలాగే ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్పందించు–సాయం అందించు కార్యక్రమానికి రూ.1,11,600 విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ సొమ్ము జమ చేయాలి

అనంతపురం సిటీ: నగర పాలక సంస్థలోని ఇంజినీరింగ్ కార్మికులకు సంబంధించిన ఈపీఎఫ్ సొమ్ము 14 ఏళ్లుగా జమ చేయడం లేదు. వెంటనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ తరఫున కార్మిక శాఖ జిల్లా స్థాయి అధికారులను బుధవారం కలసి కార్మికుల సమస్యను విన్నవించారు. నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 309 మంది ఇంజినీరింగ్ కార్మికులకు 2011 సంవత్సరంలో బకాయిలు ఉన్న తొమ్మిది నెలల ఈపీఎఫ్ సొమ్మును కార్మికుల ఖాతాల్లో జమ చేయించాలని కోరారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి



మండల పరిషత్ కార్యాలయంలో పని చేయని ఫ్యాన్లు

ఆత్మకూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని మండల స్థాయి అధికారులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు హాజరయ్యారు. సమావేశం దాదాపు మూడు గంటలకుపైగా కొనసాగింది. ఈ సమావేశం నిర్వహించిన గదిలో ఆరు ఫ్యాన్లు ఉండగా.. అందులో కేవలం మూడు మాత్రమే పని చేస్తున్నాయి. వేసవి కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిత్యం సమావేశాలు నిర్వహించే గదిలో ఫ్యాన్లు మరమ్మతుకు గురికావడంతో ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఫ్యాన్లకు మరమ్మత్తులు చేయించాలని కోరారు.

ఇందిరా గాంధీ ఆశయ సాధనకు కృషి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇందిరాగాంధీ ఆశయాల సాధనకు పోరాడతామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ యనుమల అన్నారు. బుధవారం ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ చెన్నవరం అధ్యక్షతన నగరంలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు లక్ష్మీపతి నాయక్, దక్షిత, హరిప్రియ పాల్గొన్నారు.

శ్రీపతి లేని లోటు తీర్చలేనిది

అనంతపురం కల్చరల్: ప్రజా సైన్సు ఉద్యమానికి వెన్నంటి నిలిచిన విలువైన కార్యకర్త శ్రీపతి మరణం తీరని లోటని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో శ్రీపతి సంతాప సభ జరిగింది. డాక్టర్ గేయానంద్ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్, జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రంగన్న, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రమ్మ, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి పరమేష్, జేవీవీ జిల్లా నాయకులు డాక్టర్ ప్రసూన, వీరరాజు, మహ్మద్ జిలాని, రామిరెడ్డి, తిరుపాల్ పాల్గొన్నారు.

అనంత వాసికి రాష్ట్ర కమిటీలో చోటు

అనంతపురం కల్చరల్: రంగస్థల దినోత్సవం సందర్భంగా నాటక రంగానికి విశిష్ట సేవలందిస్తున్న వారికి ఉత్తమ సేవా పురస్కారాలనందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఎంపిక చేసింది. ఈ కమిటీలో నగరానికి చెందిన ఎల్కేపీ కార్యదర్శి పద్మజకు చోటు కల్పించారు.



ఈ ఫొటోలో కన్పిస్తున్న వృద్ధురాలి పేరు లింగమ్మ (జంబుగుంపల గ్రామం, కుందుర్పి మండలం). సర్జికల్ సమస్యతో ఎఫ్ఎస్–5లో అడ్మిషన్‌లో ఉంది. ఈనెల 7వ తేదీ రాత్రి నిద్రలో ఉన్న లింగమ్మను ఇతర వార్డుకు వెళ్లిపోవాలని ఆస్పత్రి సిబ్బంది ఆదేశించారు. దీంతో దిక్కుతోచని స్థితిలో లింగమ్మను భర్త రామాంజనేయులు మరో వార్డుకు తీసుకెళ్లాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు. ఉన్నఫలంగా మరో వార్డుకు వెళ్లాలంటే ఎలాగని రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు మాలింగమ్మ (పందికుంట గ్రామం, వజ్రకరూరు మండలం). కడుపునొప్పితో బాధపడుతూ సర్జికల్ వార్డులో అడ్మిషన్‌లో ఉంది. కాగా ఈనెల 7న రాత్రి మాలింగమ్మను మరో వార్డుకు వెళ్లాలని చెప్పారు. దీంతో ఆమె కుమారుడు నాగరాజు మరో వార్డుకు తీసుకెళ్లాడు. ‘తాము అందుబాటులో ఉన్నాం కాబట్టి సరిపోయింది. అదే ఏదైనా పని మీద అందుబాటులో లేకపోతే ఇంట్లో వారు ఏ విధంగా మరో వార్డుకు తరలిస్తారు’ నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇది సరైన పద్ధతి కాదని అధికారులకు సూచించాడు. ఏదో ప్రారంభోత్సవం కోసం మరో వార్డుకు పంపడమేంటని ఆవేదన వ్యక్తం చేశాడు.

- ఈనెల 7న అర్ధరాత్రి మహిళా రోగులను మరోవార్డుకు తరలింపు
- మంత్రి మెప్పు కోసం ఆస్పత్రి త్రిమూర్తుల ఆరాటం
- నాలుగు వార్డుల్లోని రోగులను తరలించిన వైనం
- ఇబ్బందులు పడిన మహిళలు
- సర్వజనాస్పత్రి అధికారుల తీరుపై అసహనం

అధికారుల అత్యుత్సాహం ..
రోగులకు నరకం



ఫిమేల్ సర్జికల్ వార్డును ఖాళీ చేసి, గ్రీన్ కార్పెట్ ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్)

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో సర్వజనాస్పత్రిలో దారుణమైన పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. రోగులకందించే సేవలపై దృష్టి సారించని ఆస్పత్రి అధికారులు కూటమి ప్రజాప్రతినిధుల మెప్పుకోసం పరితపిస్తూ.. రోగులను ప్రత్యక్ష నరకం చూపిస్తున్నారు. ఈనెల 8న సర్వజనాస్పత్రిలో జరిగిన కొన్ని ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్న విషయం విదితమే. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఆస్పత్రి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వార్డుల్లో మేళ వాయిద్యాలతో మంత్రిని ఊరేగింపుగా తీసుకెళ్లిన విషయం తెలిసిందే. సర్వజనాస్పత్రిలోని ఫిమేల్ సర్జికర్ వార్డులు (ఎఫ్ఎస్ 3, 4, 5, 6) ఉండే ప్రాంతంలోనే మదర్ మిల్క్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్యాంక్ ప్రారంభోత్సవానికి మంత్రి వస్తున్నారని త్రిమూర్తులు ఓవరాక్షన్ చేశారు. ఈనెల 7న అర్ధ రాత్రి వార్డుల్లో ఉన్న రోగులను ఉన్నఫలంగా ఫిమేల్ సర్జికల్–1, 2లకు పంపారు. ఆ సమయంలో ఇక్కడి నుంచి ఏ విధంగా వెళ్లాలంటే పొద్దున్నేకల్లా వచ్చేయొచ్చు.. లేండి అంటూ అత్యుత్సాహం ప్రదర్శించారు త్రిమూర్తులు.

మహిళల దయనీయం

ఫిమేల్ సర్జికల్ వార్డుల్లో 20 మందికిపైగా మహిళా రోగులు అవస్థలు పడుతున్నారు. వివిధ రకాల సమస్యలతో వారు వైద్యం కోసం అడ్మిట్ అయ్యారు. కాగా మహిళా రోగులని కూడా చూడకుండా అర్ధ రాత్రి మరో వార్డుకు తరలించడం పెద్ద చర్చనీయాంశమైంది. ఆస్పత్రిలో ఎన్నడూ లేనివిధంగా ఇటువంటి దారుణమైన పరిస్థితులు చోటు చేసుకోవడం రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో ఆస్పత్రి సిబ్బంది కొందరిని వీల్ చైర్లపై ఇతర వార్డులకు తరలిస్తే.. మరికొందరు సెలైన్ బాటిల్ పట్టుకుంటూ నడుచుకుంటూ మరో వార్డుకు వెళ్లాల్సి వచ్చింది.

పట్టించుకోని ఉన్నతాధికారులు

ఆస్పత్రిలో వైద్య ప్రమాణాలను తుంగలోకి తొక్కుతున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఆస్పత్రిలో నెలకొన్న లోపాలు ప్రత్యక్షంగా కన్పిస్తున్నా.. తమకేం పట్టదన్న ధోరణిలో అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

కరపత్రాల ఆవిష్కరణ

అనంతపురం ఎడ్యుకేషన్: ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 26, 27, 28 తేదీల్లో కడప నగరంలో జరగనున్నాయి. బుధవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై చర్చించడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతుల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్ నాయక్, నరసింహ యాదవ్, చందు, మంజునాథ్, సమీర్, మహేష్ నాయక్, ప్రసాద్, వెంకటేష్, కిరణ్, కీర్తన, పూజ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోరా?



చీనీ మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి, సీపీఐ, సీపీఎం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: చీనీ మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సీపీఐ, సీపీఎం, రైతు సంఘాల నాయకులతో కలిసి చీనీ మార్కెట్‌ను పరిశీలించారు. ఐదారు మంది వ్యాపారులే ఇక్కడ రేట్లు నిర్ణయించి రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోవడం లేదని సెక్రటరీ, సూపర్‌వైజర్లపై మండిపడ్డారు. బయట టన్ను రూ.40 నుంచి రూ.50 వేలతో మంచి ధరలు పలుకుతున్నా.. ఇక్కడ మాత్రం టన్ను రూ.25 వేలకు మించడం లేదన్నారు. నిబంధనల ప్రకారం 4 శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉండగా.. ఇక్కడి రైతుల నుంచి 10 శాతం వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ–నామ్ అంటూ ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో కేవలం ఐదారు మంది రింగ్‌గా ఏర్పడి ధరలు నిర్ణయిస్తున్నారని తెలిపారు. తమ సరుకు ఎంత ధర పలికిందనేది కూడా రైతులకు తెలియడం లేదన్నారు. కమీషన్లు ఎక్కువ తీసుకుంటున్నట్లు, వ్యాపారులు రింగుగా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నట్లు ఇంతవరకు రైతులెవరూ తమకు ఫిర్యాదు చేయలేదని సెక్రటరి కె.గోవిందు తెలిపారు. చీనీ మార్కెట్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. ఇకనైనా పర్యవేక్షణ, నిఘా పటిష్టం చేసి రైతులకు మేలు జరిగేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

హనుమద్ వాహనంపై కోదండ రాముడు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమి వార్షిక ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. బుధవారం రాత్రి సీతారాములకు ప్రీతిపాత్రమైన హనుమద్ వాహనంపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. ఆలయ ఈవో శోభ, భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

రేపు జ్యోతిబా పూలే జయంతి

అనంతపురం రూరల్: ఈనెల 11న జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం ఉదయం 9:30 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల అలంకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో జయంత్యుత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు.

అనంతపురం సిటీ: మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తరఫున శుక్రవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి బుధవారం తెలిపారు. జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల జ్యోతిబా పూలే విగ్రహానికి కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తారన్నారు. ఆ తరువాత రెవెన్యూ భవన్‌లో జయంతి సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

రాప్తాడు: మండలంలోని హర్మోని సిటీ సమీపంలో రూ.2.50 కోట్ల నిధులతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం భూమిపూజ చేశారు. నియోజకవర్గంలోని రైతులు ఎవరూ విద్యుత్‌తో ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో రైతుల కోసం విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచులు శశికళ, తిరుపాలు, ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా రిలే దీక్షలు



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తూ కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా గురువారం నుంచి నగరంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు మేయర్ వసీం తెలిపారు. బుధవారం వినాయక నగర్‌లోని తౌహిద్ మసీదులో యూజేఏసీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు, పలు మసీదుల ఉలేమాలతో సమావేశం నిర్వహించారు. మేయర్ వసీం, మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఏకేఎస్ ఫయాజ్ తదితరులు మాట్లాడారు. టవర్‌క్లాక్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ రిలే దీక్షలు చేపట్టాలన్నారు. 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12వ తేదీ 12 గంటల వరకూ కలెక్టరేట్ వద్ద ధర్నా, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయాలన్నారు. 13న వందలాది మందితో అన్ని సంఘాల వారిని కలుపుకుని నగర వీధుల్లో ర్యాలీ నిర్వహించాలని తీర్మానించారు. బీజేపీ పూర్తిగా ముస్లింలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటుండటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యమత్యంతో రిలే దీక్షల్లో పాల్గొని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని తీర్మానించారు. అంతకుముందు ప్రధానమైన డిమాండ్లతో ఎస్పీ, డీఎస్పీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌వలి, గోల్డ్‌బాషా, ఇమామ్, రహంతుల్లా, జామాతే ఇస్లామిక్ హింద్, మానవ హక్కుల సంఘం, ప్రజాబలం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక పిల్లలకు అండగా ఉండాలి



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం ఎడ్యుకేషన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయి. సంబంధిత ఉద్యోగులు ఆ పిల్లలకు సేవాభావంతో అండగా ఉండాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కోరారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు (సీడబ్ల్యూఎస్ఎన్) గల పిల్లలకు బుధవారం కస్తూర్బా నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శైలజ మాట్లాడుతూ.. దురదృష్టవశాతూ దివ్యాంగులుగా జన్మించారని తల్లిదండ్రులు ఎవరూ బాధపడాల్సిన పనిలేదన్నారు. పిల్లల కోసం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఐఈఆర్పీలు సేవాభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పిల్లలకు ట్రై సైకిల్లు, రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్, హియరింగ్ ఎయిడ్స్, వీల్ చైర్స్, టీఎల్ఎం కిట్స్ పంపిణీ చేశారు. సుమారు రూ.22 లక్షల విలువైన పరికరాలను 244 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఐఈడీ కో–ఆర్డినేటర్ పెదయ్య, ఏఎస్ఓ గురుమునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఒక్కరోజు ఇస్తే ఎలా?



మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బర హేమలత

ఆత్మకూరు: ‘మండల వ్యాప్తంగా రేషన్ బియ్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆత్మకూరు రేషన్ దుకాణాల్లో రేషన్ బియ్యం అందక పక్క గ్రామాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఒక్క రోజుకే రేషన్ బియ్యం అయిపోయాయి అంటున్నారు. ఒక్క రోజులోనే రేషన్ దుకాణాల్లో బియ్యం ఎలా అయిపోతాయి’ అని ఎంపీపీ హేమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది లేకుండా బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మను కోరారు. తమను అభివృద్ధి కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై పలువురు సర్పంచ్‌లు మండిపడ్డారు. సర్పంచులు కేవలం సంతకాలు పెట్టడానికి మాత్రమే పనికొస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు 1బీ, అడంగల్ ఇవ్వడం లేదన్నారు. సర్వేయర్ పూర్తిగా రీ సర్వేకే పరిమితం అయితే ఎలా అని ప్రశ్నించారు. సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ చేయించుకోవాలని అధికారులు సూచించారు. పంట నష్టపోయిన రైతులకు ఈ–క్రాప్ ఉంటేనే పరిహారం అందుతుందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటి స్థలాలు ఉన్న వారు ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ తెలిపారు. బీసీ హాస్టల్‌లో పరిస్థితి అధ్వానంగా ఉందని.. ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రత లేదని మండల ప్రత్యేక అధికారి ప్రతాప్‌రెడ్డి, అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఈఓఆర్డీ కామాక్షి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

‘ప్రకాష్‌రెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదు’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

ఆత్మకూరు: పేరూరు డ్యాంకు నీరు తెచ్చి వ్యవసాయాన్ని పండుగ చేసిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ నేతలకు లేదని ఎంపీటీసీలు, సర్పంచులు మండిపడ్డారు. బుధవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు అధికమయ్యాయన్నారు. శాంతియుతంగా ఉన్న గ్రామాల్లో మళ్లీ ఫ్యాక్షన్ ను టీడీపీ నేతలు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే సునీతకు బీసీలపై అంతటి ప్రేమ ఉంటే నియోజకవర్గంలో బీసీలపై ఇన్ని దాడులు జరుగుతున్నా.. పోలీసులకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రామగిరి మండలానికి వచ్చిన అభిమానులు, ప్రజలను చూసి టీడీపీ నేతలకు భయం మొదలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడచినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. హామీలు అడిగితే టాపిక్ డైవర్ట్ చేస్తున్నారన్నారు. చేతనైతే సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చి, ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం టీడీపీ నేతలకు తగదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బర హేమలత, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, సర్పంచులు వరలక్ష్మి, నాగరత్నమ్మ, లక్ష్మీనారాయణరెడ్డి, ఎర్రిస్వామి, తిరుపాలమ్మ, రేణుకమ్మ, ఓబులేసు, కాంతమ్మ, ఉజ్జినప్ప, ఎంపీటీసీ ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, పోతన్న, ఎర్రిస్వామి, పాల్గొన్నారు.

స్టేడియంలో క్రీడలను అనుమతించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అనంతపురం: నీలం సంజీవరెడ్డి స్టేడియంలో క్రీడలను అనుమతించకపోతే ఎలా అంటూ క్రీడాకారులు, కోచ్‌లు బుధవారం సాయంతం ఆందోళన చేపట్టారు. పీటీసీ అదనపు వైస్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి నియంతృత్వ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. బుధవారం అర్ధరాత్రి వరకూ ఆందోళనలు కొనసాగాయి. అంతకుముందు డీఎస్పీ కోటిరెడ్డి నిరసనకారుల వద్దకు వచ్చి మాట్లాడే ప్రయత్నం చేశారు. క్రీడలకు అనుమతివ్వాలని కోరగా.. ఆయన స్పందించలేదు. కోటిరెడ్డి అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఒక కానిస్టేబుల్ వీళ్లు ఎంత సేపు ధర్నా చేస్తారులే సార్.. అరగంటలో వెళ్లిపోతారు అని డీఎస్పీకి ఫోన్‌లో చెప్పగా.. ఆందోళనకారులు విని మా సమస్య తీరేంతవరకు వెళ్లేది లేదంటూ భీష్మించి కూర్చుకున్నారు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కే.సాయినాథ్ వచ్చి క్రీడాకారుల డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. క్రికెట్ ఆడటానికి పోలీసు అధికారులు అంగీకరించారు. స్టేడియంలో ఉన్న అసోసియేషన్ గదులను ఇచ్చేది లేదంటూ షరతు విధించారు. అసోసియేషన్ గదులు ఇవ్వాల్సిందేనంటూ కోచ్‌లు పట్టుబట్టారు. గురువారం సాయంత్రం 5 గంటలకు సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామన్న హామీ మేరకు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్ చింతకుంట మధు, సీపీఎం నాయకులు రామిరెడ్డి, అవాజ్ పార్టీ వలి, జనసేన నాయకులు జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు మోహన్, వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ ప్రభు, క్రికెట్ కోచ్ టీవీ చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

‘ఉపాధి’ బిల్లులు చెల్లించాలి

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ సోములదొడ్డిలో పెండింగ్ ఉన్న ఉపాధి హామీ బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామాంజనేయులు, మండల నాయకుడు పుష్పరాజు మాట్లాడారు. ఉపాధి పని చేసిన 15 రోజుల్లోపు బిల్లులు చెల్లించని పక్షంలో పరిహారం ఇవ్వాలని చట్టం చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కూలీలకు పనిముట్లు, గడ్డపారలు గంపలు తాగునీరు, రవాణా చార్జీలు గడ్డపార పదునుకు రూ. 100, గంపకు రూ.10 ఇవ్వాల్సి ఉందన్నారు. ఇవేవీ ఇవ్వడం లేదన్నారు. గ్రామంలో సమస్యను వెంటనే పరిష్కారం చేయకపోతే కూలీలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కూలీలు ఓబులయ్య, రాజు, లక్ష్మీదేవి, భాగ్యమ్మ, కల్పన, నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి

అనంతపురం మెడికల్: జిల్లాలో క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ జీఎస్ ప్రశాంత్ పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో టీబీ కేసులు ఎన్ని ఉన్నాయి? అందుకు తీసుకుంటున్న చర్యలు, మందులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? అని ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

కసాయి తండ్రికి కౌన్సెలింగ్

అనంతపురం: అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారిపై ఓ తండ్రి అతి కిరాతకంగా వ్యవహరించిన ఘటనపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ ఘటనపై పోలీసులు స్పందించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన శివ, మౌనిక కులాంతర వివాహం చేసుకున్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఎదురుగా మూడు సంవత్సరాల క్రితం బాయ్స్ హాస్టల్‌లో వంట మనుషులుగా చేరారు. వీరికి మూడు సంవత్సరాల కూతురు ఉంది. హాస్టల్‌లో ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తుండటంతో తండ్రి శివ చిన్నారిపై కర్కశత్వంగా వ్యవహరించాడు. బూటు కాలితో గట్టిగా తన్నడం, గొంతు పిసకడం వంటి వికృత చేష్టలతో చిన్నారిపై హింసించాడు. ఈ ఘటనను సాక్షి వెలుగులోకి తెచ్చింది. దీంతో చైల్డ్ వెల్ఫేర్ విభాగం అధికారుల సంరక్షణలో చిన్నారిని ఉంచారు. అంతేకాకుండా చిన్నారి తల్లిదండ్రులు శివ, మౌనికకు మానసిక వైద్య నిపుణుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను పెంచే విషయంలో ఓపిక, సహనం అవసరమని మానసిక వైద్యులు సూచించారు. తండ్రి ప్రవర్తనలో మార్పు వచ్చేంత వరకూ చిన్నారిని చైల్డ్ వెల్ఫేర్ విభాగం సంరక్షణలో ఉంచనున్నారు.